సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.21వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



ఊరంతా ఖాళీ..
వర్షాలు సమృద్ధిగా కురవాలని సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామస్తులు బుధవారం ఊరు ఖాళీ చేసి సాయంత్రం వరకు పొలిమేరలో గడిపారు. 4లో

గరిష్టం/కనిష్టం
41.5°/21.2°

జిల్లా పరిధిలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి వేసవి సెలవులు
- జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం



కేరింతలు కొడుతూ బయటకు వస్తున్న బుక్కపట్నం పాఠశాల విద్యార్థులు

పుట్టపర్తి: అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో విద్యార్థులు ఆనందంతో బుధవారం తరగతి గదుల నుంచి కేరింతలతో బయటకు వచ్చారు. మొత్తం ఒక నెలా 19 రోజుల పాటు వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 12వ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి.

ఇదెక్కడి వివక్ష బాలయ్యా!
- ఉత్తమ సర్పంచ్ అవార్డు ఎంపికపై పీఏల రాజకీయం



దేమకేతేపల్లి సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ పేరును ఎంపిక చేసి డీపీఓ ఆమోదించిన ప్రతి

చిలమత్తూరు: పనితీరు ఆధారంగా ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైన చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఈడిగ తిరుమలేష్‌పై ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు వివక్ష చూపడం విమర్శలకు తావిస్తోంది. దేమకేతేపల్లి సర్పంచ్‌ను జిల్లా పంచాయతీ అధికారులు ఎంపిక చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ విషయాన్ని అధికారులు తెలపడంతో సదరు సర్పంచ్ అవార్డు తీసుకోవడానికి విజయవాడ వెళ్లేందుకు టికెట్ కూడా బుక్ చేసుకున్నారు. అయితే ఉన్నఫలంగా బాలయ్య పీఏల ఒత్తిడితో అవార్డుల జాబితాలో తిరుమలేష్ పేరును తొలగించేశారు. ఆ స్థానంలో టేకులోడు టీడీపీ సర్పంచ్ పేరు చేర్చారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇదెక్కడి వివక్ష బాలయ్యా అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం



కౌన్సిల్ హాల్‌లో చేతులెత్తిన కౌన్సిలర్లు

కదిరి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసాతో పాటు వైస్ చైర్‌పర్సన్లు కొమ్ము గంగాదేవి, అంజుకుంట రాజశేఖర్‌రెడ్డిపై బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను 30 మంది వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచారు. ఐదుగురు టీడీపీ, ఒకరు ఇండిపెండెంట్‌గా గెలిచారు. అయితే మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన అవిశ్వాస తీర్మానానికి 25 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. 11 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారి ఆర్డీఓ వీవీఎస్ శర్మ అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టగా.. 25 మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్‌పర్సన్ ఎన్నికకు జీఓ వచ్చిన తరువాత ఎన్నిక ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. సంఖ్యా బలం తక్కువ ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కూటమి నేతలు పావులు కదుపుతున్నారు.

'పది'.. ఫలితాల్లో పల్టీ!

- గతేడాది కంటే 10 శాతం తగ్గిన ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచిన జిల్లా
- బాలికలు 79.04 శాతం, బాలురు 70.81 శాతం ఉత్తీర్ణత
- కార్పొరేట్‌తో పోటీపడుతూ ప్రభుత్వ విద్యార్థుల సత్తా



సి.పూజిత, 597



హర్ష, 594





అఫ్రిది, 595



అహమ్మద్ హుస్సేన్, 595

పుట్టపర్తి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా పల్టీ కొట్టింది. గతేడాదికంటే ఏకంగా 10 శాతం మేర ఉత్తీర్ణత తగ్గడం ఆందోళన కల్గిస్తోంది. 74.79 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జిల్లాలో అన్ని యాజమాన్యాలు, ప్రయివేట్ విద్యార్థులు కలుపుకొని 21,084 మంది పరీక్షలు రాయగా 15,768 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 10,901 మందికి గాను 7,719 మంది, బాలికలు 10,183 మందికి గాను 8,049 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 70.81 శాతం, బాలికలు 79.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 84 .46 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 20వ స్థానంలో ఉండగా.. ఈ ఏడాది 74.79 శాతం ఉత్తీర్ణతతో 22కు పడిపోయింది.

అత్యధిక మార్కుల వీరులు వీరే..

కదిరి వాల్మీకి ప్రైవేట్ స్కూల్ విద్యార్థిని సి.పూజిత 597 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఇక కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల విద్యార్థులు దూదేకుల అఫ్రిది, షేక్ మహమ్మద్ హుస్సేన్ 595 మార్కులు, విశ్వకిరణ్, లక్ష్మీనరసింహారెడ్డి 594 మార్కులు సాధించారు. బుక్కపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థి హర్ష 594 మార్కులు సాధించాడు. ప్రైవేట్ పాఠశాల విద్యార్థి బుక్కపట్నం మండలం మారాలకు చెందిన సాయి కీర్తి 592 మార్కులు సాధించింది. బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి లోకేశ్ కుమార్‌రెడ్డి 591 మార్కులతో సత్తా చాటాడు.

వెనుకబడ్డ కేజీబీవీలు..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు టెన్త్ ఫలితాల్లో వెనుకబడ్డాయి. గత ఏడాది జిల్లాలోని 30 కేజీబీవీల్లో నల్లచెరువు, ముదిగుబ్బ, గాండ్లపెంట, పరిగి, తనకల్లు, రొద్దం విద్యాలయాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈసారి ఒక్క రొద్దం మాత్రమే వంద శాతం ఫలితాలను సాధించింది. మిగిలిన ఏ కేజీబీవీలోనూ ఆశించినస్థాయిలో ఫలితాలు రాలేదు. మొత్తం 1,111 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 934 మంది పాసయ్యారు. గత ఏడాది 92 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 84.07 శాతానికి పడిపోయింది. అందులోనూ అత్యధిక మార్కులు ఎవ్వరూ సాధించలేకపోయారు.

మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయి. ఈ పరీక్షలు రాయబోవు విద్యార్థులు ఈనెల 24 నుంచి 30 లోపు ఫీజు చెల్లించాల్సి ఉంది. రూ. 50 అపరాధ రుసుంతో మే 1 నుంచి 18 వరకు చెల్లించవచ్చని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. మూడుకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడుకంటే తక్కువ సబ్జెక్టులకు రూ. 110, మైగ్రేషన్ రుసుం రూ. 80 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రీకౌంటింగ్ కోరే విద్యార్థులు రూ. 500, రీ వెరిఫికేషన్, జవాబుపత్రాలు జిరాక్స్ ప్రతులు కోరే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తులను ఈ నెల 24 నుంచి మే 1లోపు సంబంధిత హెచ్ఎంల లాగిన్లలో మాత్రమే దరఖాస్తు చేయాలని డీఈఓ స్పష్టం చేశారు. నేరుగా డీఈఓ కార్యాలయానికి గాని, బోర్డ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారికి పోస్ట్‌ద్వారా కాని, వ్యక్తిగతంగా కాని అందజేసినా స్వీకరించబడవని స్పష్టం చేశారు.



సాయి కీర్తి 592



591 మార్కులు సాధించిన సిద్దరాంపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎద్దుల లోకేశ్ కుమార్‌రెడ్డితో తల్లిదండ్రులు



బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో 594 మార్కులు సాధించిన హర్షకు స్వీట్లు తినిపిస్తున్న హెచ్ఎం జగదీశ్వర్, సిబ్బంది

బాధను దిగమింగుకుని పరీక్షలు రాసి..




కుమారుడికి స్వీటు తినిపిస్తున్న సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: పదో తరగతి పరీక్షల్లో తండ్రి అనారోగ్యానికి గురవడంతో బాధను దిగమింగుకుని పరీక్షలు రాసిన విద్యార్థి 593 మార్కులతో రాణించాడు. ధర్మవరం పట్టణంలోని సుందరయ్యనగర్ శ్రీగణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.గౌతమ్ కృష్ణ పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో తండ్రి సుబ్రహ్మణ్యంకు కిడ్నీలు చెడిపోవడంతో డయాలసిస్ చేయాలని ఆస్పత్రి అత్యవసర విభాగంలో చేర్పించారు. అంతటి బాధలోనూ పరీక్షలు రాసిన తన కుమారుడు 593 మార్కులు సాధించడంపై తండ్రి సంతోషం వ్యక్తం చేస్తూ స్వీటు తినిపించాడు. ఆ విద్యార్థిని హెచ్ఎం లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు సానే రవీంద్రరెడ్డి, గోపి, శేఖర్, వెంకటరాముడులు అభినందించారు.

నేడు సత్యసాయి ఆరాధనోత్సవాలు

- ప్రశాంతి నిలయంలో వేడుకలు
- దేశ విదేశాల నుంచి తరలివచ్చిన సత్యసాయి భక్తులు
- సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి


ప్రశాంతి నిలయం: ప్రపంచ మానవాళికి ఆధ్యాత్మిక, మానవతా విలువలను బోధిస్తూ సన్మార్గం వైపు నడిపిన మహనీయుడు సత్యసాయి ఆరాధనోత్సవాలు గురువారం జరగనున్నాయి. ఇందు కోసం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సర్వం సిద్ధం చేశారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక ఫల,పుష్ప దళాలతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. తమ ఇష్ట దైవం సత్యసాయికి ఆత్మనివేదన అర్పించుకోవడానికి దేశ విదేశాల నుంచి భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.

వేడుకలు ఇలా...

సత్యసాయి ఆరాధనోత్సవ వేడుకలు సాయికుల్వంత్ సభా మందిరంలో గురువారం ఉదయం 8 గంటల సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో ప్రారంభం కానున్నాయి. ఉదయం 8.10 గంటలకు సత్యసాయి విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ పంచరత్నకీర్తనలు ఆలపిస్తారు. 9.05 గంటలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రారంభోపన్యాసం చేస్తారు. 9.15 గంటలకు సత్యసాయి శతజయంతి వేడుకల బ్రోచర్ విడుదల చేస్తారు. 9.30కు సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండే వేడుకలనుద్దేశించి ప్రసంగిస్తారు. 9.40కు శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని కార్యక్రమం ప్రారంభోత్సవం నిర్వహిస్తారు. 9.50కి సత్యసాయి పూర్వపు దివ్య ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. 10.10 గంటలకు భజనలు, అనంతరం మంగళహారతితో వేడుకలు ముగుస్తాయి.

హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ..

సత్యసాయి ఆరాధనమహోత్సవం సందర్భంగా సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మహానారాయణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. సాయికుల్వంత్ సభా మందిరంలో ఆరాధనోత్స వేడుకలు ముగిసిన అనంతరం ఉదయం 10 గంటలకు నారాయణ సేవ కార్యక్రమాన్ని హిల్‌వ్యూ స్టేడియంలో ప్రారంభిస్తారు. 50 వేల మందికి అన్న ప్రసాదంతో పాటు నూతన వస్త్రాలను వితరణ చేస్తారు. భక్తులు ఉదయం 8 గంటలకే సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంకు చేరుకోవాలని కోరారు. డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నారాయణ సేవకు సిద్ధమైన హిల్‌వ్యూ స్టేడియం

ఉగ్రవాదులది పిరికిపంద చర్య



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప తదితరులు

హిందూపురం టౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని పిరికిపంద చర్యగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అభివర్ణించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ అమాయకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. పహల్గాం ఘటనలో పలువురు మరణించడం బాధాకరమని అన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించారన్నారు. మృతులందరికీ సంతాపం తెలుపుతున్నామని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్క, మాట్లాడుతూ ఉగ్రదాడి ఘటన ఎంతగానో కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు అండగా యావత్ దేశం ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సైతం సీరియస్‌గా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, జిల్లా అధికారి ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, పట్టణ కన్వీనర్ మన్సూర్, మండల కన్వీనర్ రాము, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మడకశిరకు రేపు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి రాక

మడకశిర: రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మడకశిరలో పర్యటించనున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యటనలో భాగంగా ఇండోర్ స్టేడియం, డిపో పరిధిలో నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించనున్నారు. అలాగే అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ చేసి, ఆర్టీసీ డిపోను సందర్శించనున్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న సీసీటీవీ ఇన్‌స్టలేషన్ కోర్సులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బుక్కపట్నం ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మగ్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 79815 41994లో సంప్రదించవచ్చు.

గోడ కూలి వృద్ధురాలి మృతి

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి గ్రామంలో బుధవారం పాత మిద్దె గోడ కూలి నారాయణమ్మ(73) మృతి చెందింది. మరో వృద్ధురాలు వసుంధరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఎండకు తాళలేక రామాలయం వీధిలోని వేమారెడ్డి పాత మిద్దె వద్ద రోజూ వృద్ధులు సేదతీరుతుంటారు. బుధవారం అక్కడ నారాయణమ్మ, వసుంధరమ్మ కూర్చొని మాట్లాడుకుంటుండగా ఉన్నఫళంగా గోడ కూలింది. శిథిలాల కింద చిక్కుకుని నారాయణమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన వసుంధరమ్మను గ్రామస్తులు చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు.

ప్రమాదంలో ఫైర్ మెన్ మృతి


సుధాకర్ (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఫైర్ మెన్ సుధాకర్ (40) దుర్మరణం పాలయ్యారు. అనంతపురంలో నివాసముంటున్న ఆయన పుట్టపర్తిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం విధులు ముగించుకున్న ఆయన అనంతపురానికి వెళ్లే క్రమంలో మామిళ్లపల్లికి చేరుకున్నారు. అనంతరం బస్సు కోసం జాతీయ రహదారిని దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వేగంగా వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య రమ్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మార్కులే జీవితం కాదు

హిందూపురం పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని బుధవారం వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో 600లకు 571 మార్కులు సాధించింది. అయితే ఆ విద్యార్థినికి వారి తల్లిదండ్రులకు తృప్తి లేదు. దీంతో ఆ విద్యార్థిని బోరున విలపించింది. ఇక్కడ ఆమె కంటే తక్కువ మార్కులు వచ్చిన వారు ఉన్నారనే భావన సదరు విద్యార్థినితో పాటు తల్లిదండ్రులూ గుర్తించలేకపోయారు. అంతటితో ఆగకుండా ఆమె ఆత్మస్థైర్యం కోల్పోయేలా పెదవి విరుపు మాటలతో నిరుత్సాహపరిచారు.

హిందూపురంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన ఓ విద్యార్థి 600లకు 470 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఈ సంతోషాన్ని పదిమందితో పంచుకునేందుకు స్వీట్లు పంచాడు. మార్కులు తక్కువ వచ్చాయి కదా? అని అడిగితే ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులు మరిన్ని ఎక్కువ మార్కులు సాధిస్తాననే ఆత్మస్థైరాన్ని కనబరిచాడు.

.... ఆశించిన ఫలితం రాలేదని, ఉత్తీర్ణత సాధించలేకపోయామనే భావనలో కొందరు విద్యార్థులు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్షణికమైన ఆలోచనతో సరిదిద్దుకోలేని నిర్ణయం తీసుకుంటున్నారు. దీన్ని అధిగమించి, ఆశావహదృక్పథంతో అడుగేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. మార్కులే జీవితం కాదనే అంశంపై పిల్లలను చైతన్య పరచాలని అంటున్నారు.

- వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాలు
- ఓటమి విజయానికి తొలిమెట్టు
- క్షణికావేశంతో అనాలోచిత నిర్ణయాలు వద్దు



హిందూపురం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. ఎంతో మందికి 600లకు 400లకు పైబడి మార్కులు వచ్చాయి. పలు కారణాలతో కొందరు పరీక్ష తప్పారు. అలాంటి వారు క్షణికావేశంతో అనాలోచిత నిర్ణయాలు తీసుకోరాదని, మార్కులే జీవితం కాదని మేధావులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఓటమి కూడా భవిష్యత్తు విజయానికి తొలిమెట్టులాంటిదని అంటున్నారు. పరీక్షల్లో ఎందుకు తప్పాం? లోపం ఎక్కడ ఉంది? అనే అంశాలను విశ్లేషించుకుని అడుగు ముందుకేస్తే త్వరలో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో తప్పక ఉత్తీర్ణత సాధిస్తారని అంటున్నారు.

ఫెయిల్ అంటే జీవితంలో ఓడిపోవడమా?

ఫెయిల్ అంటే ఎప్పటికీ ఓడిపోవడం కాదు. విజయాన్ని ఇంకా అందుకోలేదని అర్థం, గెలుపునకు తగినంత సన్నద్ధత కాలేదని అర్థం. ప్రతి మనిషి తన జీవితంలో చేసే ప్రయత్నాలన్నీ గెలుపు లక్ష్యంగానే మొదలు పెడతాడు. ఆ ప్రయత్నాలలో విజయాలే కాదు ఓటమి కూడా ఎదురవుతుంది. విజయాన్ని సాధించాలంటే కొన్నిసార్లు ఓటమిని తప్పనిసరిగా అంగీకరించాల్సి వస్తుంది. ఓటమి విజయానికి తొలిమెట్టు అనే మాటను మరచిపోకూడదు. చాలామంది వారు చేసే పనులలో ఓటమి ఎదురయినప్పుడు భయపడి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. మరో ప్రయత్నం చేస్తూ ఉండాలి. విఫలమైన ప్రతిసారీ చేసిన తప్పేంటో అర్థం చేసుకుని అది పునరావృతం కాకుండా ముందడుగు వేస్తే తిరుగులేని విజయం సొంతమవుతుంది.

తల్లిదండ్రులూ ఆలోచించండి..

ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో పరీక్షలు తప్పి ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేశారు. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు ఆత్మనూన్యత భావంతో మానసిక స్థైర్యం కోల్పోయారు. ఆశలన్నీ పిల్లలపైనే పెట్టుకున్న తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. ఒక్క క్షణం ఆలోచించి ఉంటే ముందున్న విస్తృత అవకాశాలు తెలిసి ఉండేవి. ఓటమి కూడా భవిష్యత్తులో సాధించబోయే విజయానికి తొలిమెట్టు అనే విషయాన్ని గుర్తించకపోవడమే ఇందుకు కారణమని విశ్లేషకులు అంటున్నారు. పాస్, ఫెయిల్ సాధారణ విషయాలే అయినా వ్యక్తిగత ప్రతిష్టకు పోయి పిల్లల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయరాదని తల్లిదండ్రులకూ సూచిస్తున్నారు. విద్యార్థులు సైతం ప్రతికూలంగా ఉన్న ఫలితాలపై ఎలాంటి ఆందోళన చెందకుడా పొరపాటును సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలని అంటున్నారు.

అర్హత తెలిపేందుకే సర్టిఫికెట్



మార్కులు, సర్టిఫికెట్ అనేది కేవలం అర్హతను మాత్రమే తెలుపుతాయి. పెద్దగా చదువుకోలేని వారు... పదో తరగతి పరీక్షల్లో తప్పిన వారు సైతం ప్రస్తుతం వ్యాపారాల్లో రాణించి ఉన్నత స్థానానికి ఎదిగారు. మార్కులు తక్కువ వచ్చాయని, మనం కోరుకున్న కళాశాలలో సీటు రాదని బెంగ అక్కర్లేదు. ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ దాగి ఉంటుంది. దానిని తల్లిదండ్రులు గుర్తించి, పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలి.

– డాక్టర్ సతీష్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు

పిల్లలను ప్రోత్సహించాలి



పిల్లలు ఫెయిలయితే తల్లిదండ్రులు తిట్టడం సర్వసాధారణం. దీని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. పదో తరగతి అంటే పెద్ద వయసేమీ కాదు... మరోసారి మంచిగా చదివి ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించాలి. అప్పుడే విద్యార్థులు క్షణికావేశానికి లోనుకాకుండా ఉంటారు. లేకపోతే వారిలో ఆత్మనూన్యత భావం పెరిగి అనాలోచిత నిర్ణయాలు తీసుకునే ప్రమాదముంది.

– బాబావలి, విద్యార్థి సంఘం నాయకుడు, హిందూపురం

ఎన్‌సీడీసీ రుణాల రికవరీ పెరగాలి

- షీప్ యూనియన్ మహాజన సభలో చర్చ


మాట్లాడుతున్న షీప్ యూనియన్ ఈడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల సభ్యులు తీసుకున్న రాయితీ రుణాల రికవరీ పెరిగితే... కొత్తగా రుణ ప్రతిపాదనలు పంపిస్తామని షీప్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షీప్ యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉమ్మడి జిల్లా మహాజన సభలో ఈ అంశంపై చాలా సేపు చర్చ సాగింది.

ఈడీ కేఎల్ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాజనసభలో పర్సన్ ఇన్‌చార్జి హోదాలో డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, అలాగే పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, సహకార అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్‌సీడీసీ నుంచి రూ.10 కోట్ల వరకు రుణాలు అందించామని, గడువు మీరినా ఇంకా రూ.2.50 కోట్ల రుణాల వసూళ్లు పెండింగ్‌లో ఉన్నందున కొత్తగా రుణాల మంజూరుకు అవరోధం ఏర్పడుతోందన్నారు. ఇది ఆర్థికంగా పురోగతి సాధించాలనుకున్న గొర్రెలు, మేకల సహకార సంఘాల సభ్యులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. అనంతరం పెండింగ్ రుణాలు సాధ్యమైనంత తొందరగా చెల్లించాలని లేదంటే అవసరమైన చర్యలు తీసుకునేలా సభ ఆమోదం తెలిపింది. జిల్లా సమాఖ్య పాలకవర్గం ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలని దీనిపై ఈడీ నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. గొర్రెలు, మేకల పెంపకంపై వేలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నందున ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జేడీ వెంకటస్వామి తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏర్పడిన పాలకవర్గాల అధ్యక్షులు, సభ్యులను పరిచయం చేసుకుంటూ... రిజిస్టర్లు, సమావేశాలు, ఆడిటింగ్ నిర్వహణ అంశంపై అవగాహన కల్పించారు.

పెచ్చుమీరిన అక్రమాలు, దౌర్జన్యాలు

- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: కూటమి పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. బుధవారం పెనుకొండ మండలం శెట్టిపల్లిలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల శెట్టిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు క్రిష్టారెడ్డి భూములకు సంబంధించి అధికారుల సహకారంతో మంత్రి సవిత అనుచరులు ఇబ్బందులు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. దీంతో ఆయన హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. అమాయక ప్రజల ఆస్తులను కబ్జా చేసేందుకు పెనుకొండ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఇసుక, డీజిల్ అక్రమంగా సరఫరా చేస్తూ మంత్రి సవిత సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులును ప్రభుత్వం కక్షపూరితంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. కదిరిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కైవసం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను బెదిరించి తమవైపు లాక్కోవడం ఎంత వరకు సమంజసమో ఎమ్మెల్యే కందికుంటకు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు, బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్యామలాబాయి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, క్రిష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సాయిరాం నాయక్, అశ్వత్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: త్వరలో జరిగే బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీతో పాటు ప్రత్యేక పాయింట్ల కోసం మెడికల్ సర్టిఫికెట్లు దరఖాస్తు చేసే టీచర్లు గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా సర్వజన ఆస్పత్రిలో జరిగే వైద్య సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తమవద్ద ఉన్న సర్టిఫికెట్లను పరిశీలించి వైద్యబృందం కొత్తగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు రూ. వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తొలిరోజు అనంతపురం జిల్లా టీచర్లు, రెండోరోజు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని టీచర్లు హాజరుకావాలన్నారు. ఈ రెండు రోజుల్లో గైర్హాజరైన వారికి చివరి రోజు అవకాశం ఉంటుందన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రక్రియ సాగుతుందని డీఈఓ పేర్కొన్నారు.

చెరువులో విష ప్రయోగం


మృతి చెందిన చేపలు

ముదిగుబ్బ: మండలంలోని సానేవారిపల్లి చెరువులో బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందాయి. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో మత్స్యకారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చేపల మృతితో చెరువు ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఎవరో కావాలనే చెరువులో విషం కలిపినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

చైన్‌స్నాచర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేవీ మహేష్

హిందూపురం అర్బన్: ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను అపహరించుకెళుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. హిందూపురం రెండో పట్టణ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ మహేష్ వెల్లడించారు. హిందూపురం, పరిసర ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్ ముఠా తిరుగుతున్నట్లు అందిన సమాచారంతో అప్రమత్తమైన టూటౌన్, అప్‌గ్రేడ్ సీఐలు అబ్దుల్ కరీం, ఆంజనేయులు, సిబ్బంది బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆటో నగర్ క్రాస్ వద్ద అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతున్న ముగ్గురు యువకులను ఆరా తీయడంతో పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో చైన్‌స్నాచింగ్ ఘటనలు వెలుగు చూశాయి. పట్టుబడిన వారిలో హిందూపురంలోని త్యాగరాజనగర్‌కు చెందిన హఫీజ్, (ఆఫీసుల్లా), సీపీఐ కాలనీ ఎర్రకొట్టాలకు చెందిన దాదా ఖలందర్, లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన పి.లక్ష్మిదేవి (ప్రస్తుతం విద్యానగర్ నివాసి) ఉన్నారు. వీరి నుంచి 85 గ్రాముల బరువున్న బంగారు గొలుసులు, స్కూటీ వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా, హిందూపురం పరిధిలో 2024, 2025లో చోటు చేసుకున్న రెండు చైన్‌స్నాచింగ్ కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సత్యసాయి సేవలకు న్యూయార్క్ కౌన్సిల్ విశిష్ట గుర్తింపు



న్యూయార్క్‌లో సత్యసాయి శతజయంతి నిర్వహణను అధికారికంగా ప్రకటిస్తున్న మేయర్ ఎరిక్ అడమ్స్

ప్రశాంతి నిలయం: సత్యసాయి సేవలకు అమెరికాలోని న్యూయార్క్ కౌన్సిల్ విశిష్ట గుర్తింపునిచ్చింది. ఈ నెల 24న సత్యసాయి శతజయంతి వేడుకల నిర్వహణ దినంగా ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 22న న్యూయార్క్ నగర కౌన్సిల్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో న్యూయార్క్ సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్ అధికారికంగా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రత్యేకంగా రాసిన సందేశాన్ని చదివి వినిపించారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

మడకశిర: ఒంటరిగా వెళుతున్న వారిని అటకాయించి చోరీలకు పాల్పడే నలుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని, మడకశిర అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ నగేష్‌బాబు తెలిపారు. స్థానిక పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వారు వెల్లడించారు. ఈ నెల 18న తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై పొలానికి బయలుదేరిన మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సుభాషిణి దంపతులను దారి మధ్యలో అడ్డుకుని బంగారు, వెండి గొలుసులను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం కల్లుమర్రి గ్రామ సమీపంలో 544ఈ జాతీయ రహదారిపై ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని, సీఐ నగేష్‌బాబు పర్యవేక్షణలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై అటుగా వచ్చిన నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి వెనక్కు వెళ్లే ప్రయత్నం చేశారు. పసిగట్టిన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఈ నెల 18న సుభాషిణి మెడలోని బంగారు, వెండి గొలుసులను అపహరించిన విషయం వెలుగు చూసింది. పట్టుబడిన వారిలో కర్ణాటకలోని మధుగిరి తాలూకా బేడ్తూరు గ్రామానికి చెందిన హరీష్, నల్లకామనహళ్లికి రాకేష్‌బాబు, మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందిన రమేష్, పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి నివాసి ఒకరు ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఓ బంగారు, మరో వెండి గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఊరంతా ఖాళీ...


గ్రామంలోకి ఎవరూ వెళ్లకుండా అడ్డు వేసిన దృశ్యం

సోమందేపల్లి: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామస్తులు బుధవారం గ్రామాన్ని ఖాళీ చేసి పొలిమేరల్లో గడిపారు. ఏటా సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ఈ ప్రక్రియను ఆనవాయితీగా పాటిస్తూ వస్తున్నారు. గ్రామంలోకి ఎవరూ ప్రవేశించకుండా ముఖద్వారం వద్ద ముళ్ల కంచె వేశారు. వ్యవసాయ పొలాలు, బావులు, చెట్ల కిందకు చేరుకుని వంటావార్పుతో సందడి చేశారు. సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి హేయం

- నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్
- ఎస్పీకి వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు



ఎస్పీ రత్నకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్: వ్యతిరేక వార్త వచ్చిందని ఏలూరు సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జర్నలిస్టులతో కలిసి ఎస్పీ రత్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాక్షి కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు అక్కడ విధుల్లో ఉన్న పాత్రికేయునిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వాస్తవాలు వెలికితీసే జర్నలిస్టులపై దాడులను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. పత్రికలో వచ్చిన వార్తలో వాస్తవాలు లేకుంటే దానికి వివరణ ఇవ్వాలే కానీ, కార్యాలయంపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే జర్నలిస్టులపై కక్షపూరితంగా కుట్రలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పుల్లయ్య, బాబు, దివిటీ రాజేష్, గంగిరెడ్డి, కేశవరెడ్డి, ఉద్దడం చంద్రశేఖర్, రమణ, విజయశేఖర్‌రెడ్డి, సతీష్, టీసీ గంగాధర్, అంజిప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్య సరికాదు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జర్నలిస్టులపై నిత్యం దాడులు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తూ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. దాడులతోపాటు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికే ముప్పు వాటిల్లుతుంది. పాలకులు స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలి.

– దివిటీ రాజేష్, సాక్షి స్టాఫ్ రిపోర్టర్

దాడులు మంచి పద్ధతి కాదు

ప్రజల పక్షాన వార్తలు రాస్తూ సమాజ అభివృద్ధి కోసం పాటు పడే పాత్రికేయులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. ఏమైనా అభ్యంతరం ఉంటే ఖండించే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ ఇలా పాత్రికేయులపై కక్షసాధింపు ధోరణి ప్రదర్శించడం తగదు. ఏలూరులో సాక్షి కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడులు ఇలాగే కొనసాగితే ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– చింతకాయల పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే

చర్యలు తీసుకోవాలి

నిజాలు బయటకు తీసి ప్రజలకు తెలియజేసే రిపోర్టర్లు, కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య. ఇది ప్రజాస్వామ్యానికి పూర్తి వ్యతిరేకం. రాజకీయంగా కక్షలు ఉంటే రాజకీయంగానే చూసుకోవాలి. అంతేకానీ జర్నలిస్టులపై దాడులు చేయడం మంచి పద్ధతికాదు. దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే చింతమనేని అనుచరులను అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి.

– డి.బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే